ప్రమాదాల నివారణకు చర్యలేవి?

- మలుపుల వద్ద కానరాని సూచిక బోర్డులు
- ఒకే నెలలో నలుగురు మృతి

మరికల్: మండలంలోని రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. జాతీయ రహదారితో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లు, మలుపుల దగ్గర సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదం చోటుచేసుకుంటుంది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కొన్ని సార్లు మరణాలు సంభవిస్తుండగా కొన్ని సార్లు బాధితులు తీవ్రంగా గాయాలు పాలవుతున్నారు. గతంలో అంతర్రాష్ట్ర రహదారిగా ఉన్న మహబూబ్‌నగర్, రాయచూర్ రహదారిని రెండు లైన్లుగా విస్తరించి 167 జాతీయ రహదారిగా మార్చారు. మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వరకు వందల సంఖ్యలో మలుపులు ఉన్నా అక్కడక్కడ మాత్రమే సూచిక బోర్డులు, వేగ నియంత్రణ బోర్డులు కన్పిస్తాయి. దీంతో ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నెలలో మరికల్ మీదుగా వెళ్లిన జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేక వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడ బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోడ్డుకు చెట్లు అడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనం కన్పించకపోవడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గడిచిన రెండేళ్లలో మరికల్‌లో రోడ్డు ప్రమాదాలకు గురై 12 మంది మృతి చెందగా, అనేక మంది క్షతగాత్రులుగా మారారు.


కన్మనూర్ వెళ్లే రహదారిపై బైక్‌ను ఢీకొట్టిన ఆటో (ఫైల్)


ప్రమాదకరంగా నర్వ-కన్మనూర్ రహదారి

గ్రామీణ రహదారులు అంతే..

మరికల్ నుంచి కన్మనూర్, మాధవరం నుంచి వెంకటపూర్, పల్లెగడ్డ నుంచి పూసల్‌పహాడ్, మరికల్ నుంచి ఇబ్రహీంపట్నం, లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే గ్రామీణ రహదారులపై మలుపుల దగ్గర ఎక్కడ కూడా ఒక సూచిక బోర్డు కానీ స్పీడ్ బ్రేకర్లు గానీ ఏర్పాటు చేయలేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రోడ్ల పైకి ముళ్ల చెట్లు అల్లుకుపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ రోడ్లపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మరికల్, కన్మనూర్, నర్వ మధ్యన ఉన్న రహదారికి దాదాపు 50కి పైగా మలుపులు ఉన్నాయి. రాత్రి సమయంలో బైక్‌పై సొంత గ్రామాలకు వెళ్లేటప్పుడు మలుపుల దగ్గర అదుపుతప్పి లేక ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల దగ్గర సూచిక బోర్డులతో పాటు బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అంజనేయులు, ఆటో డ్రైవర్, కన్మనూర్

ముళ్లచెట్లను తొలగించాలి



జాతీయ రహదారితో పాటు గ్రామీణ రహదారులపై మలుపుల దగ్గర ఉన్న ముళ్లచెట్లను తొలగిస్తే ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించి ప్రమాదాలు తగ్గుతాయి. ముళ్లచెట్లను తొలగించకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్ల మలుపుల దగ్గర చిన్న, చిన్న స్పీడ్ బ్రేకర్లతో పాటు అటు, ఇటు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– వెంకటేశ్, పెద్దచింతకుంట

సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి బారికేడ్లను ఏర్పాటు చేశాం. జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటే కొద్దిమేర ప్రమాదాలను తగ్గించవచ్చు. గ్రామీణ రహదారుల మలుపు దగ్గర కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారిస్తాం.

– రాము, ఎస్‌ఐ, మరికల్

నిస్వార్థ ప్రేమకు నిలువెత్తు రూపం.. నాన్న

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలి అయిన కావలి వెంకటయ్య తన ఇద్దరు కుమారులను ప్రయోజకులను చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. తాను చదువుకోకపోయిన బిడ్డలను ఉన్నత చదువులు చదివించి ఒకరిని ఎస్‌ఐగా మరొకరిని కానిస్టేబుల్‌గా తీర్చిదిద్ది నాన్న అనే పదానికి నిజమైన అర్థం చెప్పారు. వెంకటయ్య తనకున్న 2 ఎకరాల భూమిలోనే కూరగాయలు పండిస్తూ జీవనం సాగించేవాడు. అయితే తన కష్టం వారికి తెలియకుండా కూతురుకు మంచి సంబంధం చేసి పెళ్లి చేశారు. ఇక రెండో కుమారుడు రాఘవేందర్ నాన్న కష్టానికి ప్రతిఫలంగా కానిస్టేబుల్‌గా ఎన్నిక కాగా చిన్న కుమారుడు గిరి ఎస్‌ఐగా రంగారెడ్డి జిల్లా యాలాల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వెంకటయ్య ఏం చదువుకోకపోయినా పిల్లలను ప్రయోజకులను చేసినందున గ్రామస్తులు ఫాదర్స్ డేను పురస్కరించుకొని హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తల్లిదండ్రులతో రాఘవేందర్

నాన్న ప్రోత్సాహంతోనే ఐఏఎస్..

నారాయణపేట రూరల్: నారాయణపేట పట్టణం పర్మారెడ్డి కాలనీకి చెందిన బొంత రాహుల్ మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించి ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పీఓగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శశికళ, తండ్రి నర్సింహులు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో నాన్న ప్రోత్సాహంతో ఐఏఎస్ అయి తండ్రికి తగ్గ తనయుడు అని నిరూపించుకున్నాడు రాహుల్. బీటెక్ పూర్తి చేసిన రాహుల్ చదువు అనంతరం ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే విద్యుత శాఖలో ఏఈ పోస్టు సాధించారు. సివిల్స్ సాధించాలనే కోరికతో రెండు సంవత్సరాల లాంగ్ లీవ్ పెట్టి న్యూఢిల్లీలో శిక్షణ తీసుకుని 2019 జూన్‌లో ప్రిలిమ్స్ పరీక్ష రాసి, మెయిన్స్‌కు అర్హత సాధించి ఇంటర్వ్యూకు కూడా ఎంపికయ్యారు. తొలి ప్రయత్నంలోనే 272 ర్యాంకు సాధించి తెలంగాణ క్యాడర్ ఐఏఎస్‌గా నియమించబ తన తండ్రికి మరచిపోలేని బహుమతిని ఇచ్చారు బొంత రాహుల్.


రాహుల్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయం ఎదుట మొరం పనులు

మరికల్: మండలంలోని తీలేర్ ఎల్లమ్మ ఆలయం ఆవరణం వర్షాలకు అధ్వానంగా మారడంతో శనివారం సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుభ్రత పనులు చేపట్టారు. త్వరలోనే ఎల్లమ్మ జాతర ఉన్నందున గ్రామస్తుల కోరిక మేరకు భక్తుల సౌకర్యార్థం రోడ్డుపై మొరం వేసి మరమ్మతు చేయించినట్లు సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి తెలిపారు. సమాజ సేవ చేయడంలో తమ సంస్థ ఎప్పటికీ ముందుంటుందన్నారు.

ఎక్లాస్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన పట్వారి రాములు ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం యశోద హస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దాదాపు 150 మందికి పైగా గ్రామస్తులకు ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ బండారి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట్రాములు, సుదర్శన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరా నిలిపివేత

కోస్గి రూరల్: మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి పైప్‌లైన్‌ను మారుస్తుండడంతో మండలంలో సోమవారం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్గి జంక్షన్‌లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున పైప్‌లైన్‌ను సిఫ్టింగ్ చేస్తుండడంతో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు గమనించి నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామం నుంచి మక్తల్, ధన్వాడ గ్రామాలకు బస్సు సౌకర్యం కలిపించాలని గ్రామస్తులు హెచ్ నర్సింహ, మహేష్ కోరారు. ఈ మేరకు శనివారం డిపో మేనేజర్ లావణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. బిజ్వార్, పులిమామిడి, చెక్‌లేర్ మీదుగా మక్తల్‌కు ఊట్కూరు, బిజ్వార్ మీదుగా ధన్వాడ, మరికల్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. నిత్యం పలు గ్రామాల నుంచి మక్తల్, ధన్వాడ, మరికల్‌కు చదువుకునేందుకు విద్యార్థులు వెళ్తుంటారని పేర్కొన్నారు. నేరుగా బస్సు సౌకర్యం లేనందున విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి

మాగనూర్: మండల కేంద్రంలోని 10వ వార్డులో మురుగు కాలువను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. 10వ వార్డులోని మురుగు నీరు గతంలో డ్రెయినేజీ నుంచి పెద్ద వాగు వైపునకు పోయ్యేదన్నారు. అయితే ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా అండర్‌గ్రౌండ్ నిర్మాణం చేపట్టారు. అది కాస్త ఎత్తులో నిర్మించడంతో మురుగు నీరస్లైటు వెళ్లకుండా ఇళ్ల మధ్యలో నిల్వ ఉంటుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో పాటు పందులు స్వైర్యవిహారం చేస్తుండటంతో రోగాల బారీన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు నిల్వ ఉండకుండా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


10వ వార్డులో పేరుకుపోయిన మురుగు

‘ఆస్పత్రి ఏర్పాటు చేసే వరకు పోరాటం’

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని తరలించడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు చేపట్టిన 24 గంటల నిరాహార దీక్ష శనివారం ఉదయం 10 గంటలకు విరమించారు. దీక్షను బీజేపీ రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ దీక్షలో పాల్గొన్న నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ, రతంగ్ పాండు రెడ్డి, సత్య యాదవ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఆస్పత్రి ఏర్పాటు చేసి వైద్యం అందించాలని తాము చేస్తున్న ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనన్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే దీక్షకు మద్దతు తెలిపిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


దీక్షను విరమింప చేస్తున్న నాయకులు

రక్తదానానికి యువకులు ముందుకు రావాలి


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి రూరల్: రక్తదానానికి యువకులు ముందుకు రావాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 700 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకుగాను ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బక్క శ్రీనివాసులు శనివారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కోస్గి, హన్వాడలో మూడు శిబిరాలు ఏర్పాటు చేసి 700 యూనిట్ల రక్తాన్ని సేకరించానని అలాగే తాను స్వయంగా 35 సార్లు రక్తదానం చేశానన్నారు. ప్రభుత్వం తన సేవలను గుర్తించి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదును స్వీకరించేందుకు శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 20 వినతులు వచ్చినట్లు ఆమె తెలిపారు. నారాయణపేట నుంచి క్యాతన్ పల్లి మీదుగా లక్ష్మీపల్లికి బస్సు నడపాలని, కోస్గి బస్టాండ్ నుంచి ఉదయం 5.30 గంటలకు మొదటి బస్సు నారాయణపేటకు ఏర్పాటు చేయాలని, మక్తల్ నుంచి ముష్టిపల్లికి చివరి బస్సు 7.30 గంటలకు మార్చాలని, ఉదయం 9 గంటలకు మక్తల్ గద్వాల్ బస్సు ప్రారంభించాలని, నారాయణపేట నుంచి బూనేడు మీదుగా కోస్గికి అదనపు ట్రిప్పులు నడపాలని, తిరుమలాపురం గ్రామానికి మధ్యాహ్నం బస్సు ఏర్పాటు చేయాలని అలాగే కోస్గి నుంచి కర్ణాటక రాష్ట్రం కలబురిగికి బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు.

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నారాయణపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరు కష్టపడి కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని ఏఐసీసీ సెక్రటరీ, రాష్ట్ర పార్టీ కో ఇన్‌చార్జ్ పి. విశ్వనాథన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టిసారించారని, ఆయన సూచన మేరకు కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే నేడు జిల్లా సమావేశంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ నెల 25వ తేదీలోపు అన్ని మండల, బ్లాక్, గ్రామ అధ్యక్షుల నియామకాలు పూర్తి చేయాలని పరిశీలకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు , కార్యకర్తలకు పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులలో తప్పకుండా అవకాశం కల్పిస్తామన్నారు. పార్టీ అభ్యర్థులు ఓడిపోతే డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతే బాధ్యతన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు వేణుగౌడ్, సంధ్యారెడ్డి, ధారసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్వనాథన్

నీట్‌లో మెరిసిన గుడెబల్లూర్ విద్యార్థిని

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన చెవిటోళ్ల వెంకటేష్ కూతురు మంజుళ నీట్‌లో ఆల్ ఇండియా 1902 ర్యాంక్ సాధించింది. శనివారం యన్‌టీఏ విడుదల చేసిన నీట్ యూజీ పరీక్ష ఫలితాల్లో మంజుళ ప్రతిభ చాటింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అంబ్రేష్, శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ సామాన్య కుటుంబానికి చెందిన మంజుళ నీట్‌లో ర్యాంకు సాధించడం గ్రామానికే గర్వకారణమన్నారు. అనంతరం సదరు విద్యార్థినిని అభినందించి సన్మానించారు.


మంజుళ

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

మరికల్: వానాకాలం పంటల పెట్టుబడికి గాను ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూన్ మొదటి వారంలోనే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమ చేసేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భరోసా అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఎన్ని ఎకరాలకు రైతు భరోసా వేస్తారో చెప్పకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారన్నారు. యాసంగిలో కేవలం నాలుగు ఎకరాలు ఉన్న రైతులకే రైతు భరోసా డబ్బులు జమ చేసి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



మాగనూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలోని వర్కూర్ రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా టిప్పర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లు లింగప్ప, శ్యామల వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసు నమోదు

మరికల్: మాగనూర్ నుంచి అనుమతులు లేకుండా మహబూబ్‌నగర్‌కు ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. నిత్యం పదుల సంఖ్యలో మరికల్ మీదుగా అక్రమంగా జీరో బిల్లు మీద మహబూబ్‌నగర్‌కు ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి నిఘా పెట్టి టిప్పర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. అలాగే టిప్పర్ల యజమానులు శివకుమార్, మన్యం రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దూరు: మద్దూరు పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో పరిధిలో విద్యుత్ లైన్లను మారుస్తుండడంతో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

‘స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం’

మక్తల్: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏమిటో చూపిస్తామని మక్తల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కర్నిస్వామి, మాజీ ఎంపీటీసీ బాల్ రాంరెడ్డి అన్నారు. శనివారం మక్తల్ మండలం సంగంబండ గ్రామంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. బూత్‌లెవల్ నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా కటికెలి లింగప్ప, పల్లవి, బోయరవి, మహదేవమ్మ, రాజు, జనార్ధన్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రసన్న, చీరాల సత్యనారాయణ, జయనంద్‌రెడ్డి, నరేస్, వెంకట్‌రాములు తదితులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ కర్నిస్వామి

రోడ్లను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లను కొందరు రైతులు పైపులైన్ల కోసం అడ్డగోలుగా గోతులు తవ్వుతుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా మండలంలోని పంచాయతీ రాజ్ రహదారులైన వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, వడ్వాట్ గ్రామాలకు చెందిన కొందరు రైతులు పొలాలకు సాగునీటిని తరలించడానికి రోడ్లను ఇష్టమొచ్చినట్లు తవ్వుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం అవుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడ్డగోలుగా రోడ్డును తవ్వి మట్టివేసి వదిలేస్తుండడంతో గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లను తవ్వకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.


నేరడగం సమీపంలో రోడ్డు తవ్వి పైపులైన్ వేసిన రైతులు

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి

నారాయణపేట: నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ ఎన్.లింగయ్య సిబ్బందికి సూచించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులపై సిఐలు, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో విచారణ ఎలా చెయ్యాలి, ఏఏ అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాలను వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్‌ఓపి ప్రకారం విచారణ చేసి కేసులు ఛేదించాలన్నారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, కేసు నమోదు నుంచి చార్జీషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా, గంజాయి, గుట్కా, పేకాట రవాణా, అమ్మకాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు.

బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఊట్కూరు: ప్రభుత్వం బీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా నాయకులు చెన్నప్ప డిమాండ్ చేశారు. శనివారం ఊట్కూరులో బీడి కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16న నారాయణపేట పట్టణంలో టీయూసీఐ ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు బీడి కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, ఆశా వర్కర్‌లు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నూతన అధ్యక్షుల ఎన్నిక

కోస్గి రూరల్: సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జిల్లా ప్రబారి చాపల హన్మంతు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాలుగు మండలాల విశ్వహిందూ పరిషత్ ప్రఖండ నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోస్గి మండల అధ్యక్షుడిగా బెజ్జు వెంకట్రాములు , గుండుమాల్ కుమ్మరి మల్లయ్య , గండీడ్ ఆంజిలయ్య , కదనగల్లు వేణుగౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం, ఉపాధ్యాక్షుడు నవీన శ్రీను, ప్రధాన కార్యదర్శి తౌఫీఖ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఫొటో స్టూడియోల నిర్వాహకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు అత్యాధునిక కెమెరాలు ఉచితంగా ఇవ్వాలని, రూ.10 లక్షలు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కొత్తపల్లి: రైతు గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని భూనీడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కోట్ల జైపాల్‌రెడ్డి (46) పొలంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురైయ్యాడు. ట్రాక్టర్ సీటుపైనే కుప్పకూలడంతో ట్రాక్టర్ కొద్దిదూరం వెళ్లి పొలం గట్టుకు తాకి ఆగిపోయింది. గమనించిన చుట్టపక్కల వారు జైపాల్ రెడ్డిని ట్రాక్టర్‌పై నుంచి దించి సీపీఆర్ చేసే ప్రయత్నం చేశారు. తర్వాత 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే జైపాల్ రెడ్డి మృతి చెందాడు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

నారాయణపేట రూరల్: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. రాజకీయాల్లోనూ రాణించే విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మహేష్, ఏర్జీట మండల ట్రైనర్ వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.